క్లుప్తంగా

ఎయిడ్స్‌పై అవగాహన



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ప్రోగ్రాం అధికారులు

దహెగాం: మండల కేంద్రంలోని మార్కెట్ ఏరియాలో గురువారం శ్రీసాయి మహిళా మండలి ఎన్‌జీవో ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఎంఎం ప్రాజెక్ట్ మేనేజర్ ఈర్ల సునీల్ మాట్లాడుతూ ఎయిడ్స్‌పై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పలువురి వద్ద నుంచి రక్తనమూనాలు సేకరించారు. ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్, ఉప సర్పంచ్ ప్రశాంత్, జీఎస్ఎం కవిత, సిబ్బంది అనికేత్, కె.సరోజ, సుమలత, ప్రగతి, స్రవంతి, భాగ్య, ఆశకార్యకర్త శోభ తదితరులు పాల్గొన్నారు.

పంటల వివరాలు సేకరించాలి



రైతులతో మాట్లాడుతున్న ఏవో రాజేశ్

కౌటాల: మండలంలో రైతులు వర్షాధారంపై ఆధారపడి పండిస్తున్న పంటల వివరాలను సేకరించాలని ఏవో పాలకుర్తి రాజేశ్ అన్నారు. మండలంలోని భాలేపల్లి గ్రామంలో రైతులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ గ్రామాల్లో ఏఈవోలు గత ఖరీఫ్‌లో రైతులు వర్షాధారంతో సాగు చేసిన పంటల వివరాలు గుర్తించాలన్నారు. మూడు రోజులపాటు పల్లెల్లో గ్రామ కమిటీలు సర్వే చేయాలన్నారు. చెరువులు, కుంటలు, బావులు, బోర్‌బావులతో ఎన్ని ఎకరాలకు సాగునీరు అందుతుందో పూర్తి సర్వే చేయాలని సూచించారు. ఈ నివేదికలను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సర్పంచ్ జాడి కుశబ్‌రావ్, ఏఈవో ఘన్‌శ్యాం, కార్యదర్శి సాయికృష్ణ, రైతుబంధు సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



ట్రోఫీతో విజేత జట్టు, పోలీసులు

బెజ్జూర్: నిత్యం విధుల్లో బిజీగా ఉండే పోలీసులకు క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎస్సై వెంకటేశ్ అన్నారు. గత కొన్నిరోజులుగా మండలంలోని కుకుడ గ్రామ పంచాయతీ స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించగా, ప్రథమ బహుమతి బెజ్జూర్ పోలీస్ జట్టు కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ క్రీడలతో శారీరకంగా దృఢంగా ఉండడంతోపాటు స్నేహభావం పెంపొందుతుందన్నారు. పోలీసు కానిస్టేబుళ్లు వినోద్, ప్రకాశ్, అర్షద్, ఎస్.వెంకటేశ్, క్రాంతి, రాంబాబు, రాజేష్, జి.వెంకటేశ్, మహేశ్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

‘దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రజాధనం వృథా’

కాగజ్‌నగర్‌టౌన్: దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజా ధనం వృథా చేయడం సరికాదని బీజేపీ నాయకుడు కొంగ సత్యనారాయణ ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరువుల్లో నీరు లేకున్నా బీఆర్ఎస్ నాయకులు మందు, మాంసంతో అక్కడ సంబరాలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. పార్టీ నాయకులు వీరభద్రచారి, గొలెం వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు

‘వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం’

తిర్యాణి: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మర్సుకోల సరస్వతి ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని మంగి, ముల్కలమంద, రోంపెల్లి పంచాయతీల్లో గురువారం ఆమె పర్యటించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాజీవ్‌గాంధీ క్విజ్ ఆన్‌లైన్ పోటీలో యువత పాల్గొనాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల హామీలు నేరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. పార్టీ మండల అధ్యక్షుడు చిత్తారి సాగర్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సిడాం వినోద్, నాయకులు సంజీవ్, సిడాం తెలంగారావు, మర్సుకోల శేఖర్, ఆత్రం లక్ష్మణ్, కోవ శంకర్ పాల్గొన్నారు.

మృగశిరకార్తె సందడి

కౌటాల: మండల ప్రజలు గురువారం మృగశిరకార్తెను ఘనంగా నిర్వహించారు. మిరుగును పురస్కరించుకొని మండల కేంద్రంలో చేపలు కొనుగోలు చేయడానికి ప్రజలు బారులు తీరారు. మండల కేంద్రంతో పాటు కన్నెపల్లి, గురుడుపేట, గుడ్లబోరి, పార్డి చెరువుల వద్ద సందడి నెలకొంది.

ఊరూరా చెరువుల పండుగ

- బోనాలతో మహిళలు ఊరేగింపు
- చెరువుల వద్ద బతుకమ్మ ఆట

కౌటాల: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం ఊరూరా చెరువుల పండుగ నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని మహిళలు బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా చెరువుల వద్దకు వెళ్లారు. అనంతరం బతుకమ్మ ఆట ఆడారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు కలిసి చెరువు కట్టపై సహపంక్తి భోజనం చేశారు. డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మాంతయ్య, ఎంపీపీ విశ్వనాథ్, రైతు సమితి మండల కన్వీనర్ బ్రహ్మయ్య, ఎంపీడీవో నస్రుల్లాఖాన్, ఏపీఎం వెంకటరమణ, సర్పంచులు మౌనిశ్, శ్రీనివాస్, రమేశ్, దామోదర్, రాందాస్, సునంద, రేణుక, శంకరమ్మ పాల్గొన్నారు.

కెరమెరి: మండలంలోని అమ్మన్నమడుగు, ఝరి, బిత్తర్‌మాల్, చందుట్యాంక్‌లోని చెరువుల వద్దకు గ్రామస్తులు ర్యాలీగా వెళ్లారు. చెరువు కట్టవద్ద మైసమ్మకు మహిళలు పూజలు చేశారు. అనంతరం మహిళలు బతుకమ్మ ఆట ఆడారు. ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, అడిషనల్ డీఆర్‌డీవో శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

దహెగాం: మండల కేంద్రంతోపాటు, హత్తిని, కుంచవెల్లి, కల్వాడ గ్రామాల్లోని చెరువుల వద్ద మహిళలు బోనమెత్తారు. అనంతరం బతుకమ్మ ఆటాపాట నిర్వహించారు. హత్తినిలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీటీసీ రామారావు పాల్గొన్నారు. సర్పంచులు లక్ష్మి, సుజాత, ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్ ఉన్నారు.

పెంచికల్‌పేట్: గ్రామాల్లోని చెరువుల వద్ద పూజలు నిర్వహించారు. మహిళలు బోనమెత్తారు.

చింతలమానెపల్లి: మండలంలోని చింతలమానెపల్లి, డబ్బా, దిందా, రుద్రాపూర్, ఖర్జెల్లి, గూడెం, అడెపల్లి, బాబాసాగర్ గ్రామాల్లో మహిళలు బతుకమ్మలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం చెరువుల వద్ద బతుకమ్మ ఆటలు ఆడారు. చెరువు కట్ట వద్ద గ్రామస్తులకు విందులు ఏర్పాటు చేశారు. కౌటాల సీఐ సాదిక్ పాషా, తహసీల్దార్ మష్కూర్ అలీ, ఎంపీపీ డుబ్బుల నానయ్య, ఎంపీవో సుధాకర్‌రెడ్డి, ఏపీవో గోవర్ధన్ సింగ్ పాల్గొన్నారు.

వాంకిడి: ఇందాని గ్రామంలో ప్రజలు ర్యాలీ నిర్వహించి, చెరువు వద్ద సంబరాలు జరుపుకున్నారు. లక్ష్మణ్, గిలేరావు, మహేశ్వర్, బామినె భిక్కు, నాందేవ్ పాల్గొన్నారు.

బెజ్జూర్: గ్రామాల్లో మహిళలు బతుకమ్మలు, బోనాలతో ర్యాలీ నిర్వహించారు. బతుకమ్మ పాటలతో మహిళలు ఆడిపాడారు. చెరువు కట్ట వద్ద వంటావార్పు చేసి సహపంక్తి భోజనాలు చేశారు. ఎంపీపీ డోకె రోజా రమణి, జెడ్పీటీసీ పుష్పలత, సింగిల్ విండో చైర్మన్ ఓంప్రకాశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సకారాం, సర్పంచులు ఆసియా బాను, లావణ్య, విమల, శారద, రవి, బొర్కుట్ లీలా, మండల కోఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్, ఎంపీడీవో మాధవి, తహసీల్దార్ శ్రీపాల్, ఎంపీవో రమేశ్ రెడ్డి పాల్గొన్నారు.



కెరమెరి: బతుకమ్మ ఆడుతున్న జెడ్పీటీసీ దుర్పతబాయి, మహిళలు



మహిళలతో బతుకమ్మ ఆడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, అడిషనల్ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



బతుకమ్మను ఎత్తుకున్న చాహత్ బాజ్‌పాయ్

రెబ్బెన: నంబాల చెరువు వద్ద జెడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి, అడిషనల్ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ మిషన్ కాకతీయ పథకంతో శిథిలావస్థకు చేరిన చెరువులు, కుంటలకు జీవం చేసి బీడు భూములకు సాగునీటిని అందించేందుకు కృషి చేసిందన్నారు. అనంతరం బతుకమ్మలను చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఎంపీపీ సౌందర్య, జెడ్పీటీసీ సంతోష్, తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అంజద్‌పాషా, సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



దహెగాం: హత్తినిలో బోనాలతో వెళ్తూ..



ఆసిఫాబాద్‌రూరల్: ఈదులవాడలో



బెజ్జూర్: సిద్దాపూర్‌లో..

ఆసిఫాబాద్‌రూరల్: ఈదులవాడ గ్రామ చెరువు వద్ద మహిళలు బతుకమ్మ ఆడారు. జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, సర్పంచ్ భీమేశ్, నాయకుడు పెంటు, మహిళలు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని పెద్దవాగు వద్ద జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావ్ పూజలు చేశారు. పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు, బతుకమ్మ ఆటల సంబురాలు నిర్వహించారు.



కౌటాల: ముత్తంపేటలో బతుకమ్మలతో మహిళలు



కొండపల్లిలో బోనాలతో వెళ్తున్న మహిళలు



చింతలమానెపల్లి: దబ్బా గ్రామంలో..



వాంకిడి: సంబరాల్లో పాల్గొన్న గ్రామస్తులు

వ్యవసాయరంగ అభివృద్ధికి కృషి



బతుకమ్మలతో కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే

కాగజ్‌నగర్‌రూరల్: వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కోసిని, ఈజ్‌గాం, గన్నారం గ్రామాల్లో గురువారం ఊరూరా చెరువుల పండుగను నిర్వహించారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఎస్పీ సురేశ్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. మహిళలు బోనాలు, బతుకమ్మలతో ఆటాపాట నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా నిర్వహించామన్నారు. తహసీల్దార్ మునావర్ షరీఫ్, ఎంపీడీవో గౌరీశంకర్, డీఎస్పీ కరుణాకర్, ఎంపీపీ చీపురుశెట్టి శంకర్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో అలసత్వం వద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పనుల్లో అధికారులు అలసత్వం ప్రదర్శించకుండా వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం పంచాయతీరాజ్ శాఖ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వంతెనలు, రహదారుల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. భారీ వర్షాలు పడేలోగా పనులు పూర్తిచేసేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. వంతెనలు పూర్తయిన చోట అప్రోచ్ పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్‌శాఖ ఈఈ రామ్మోహన్‌రావు, డీఆర్‌డీవో సురేందర్, డీఈ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పత్తి వైపే రైతుల చూపు..!

- వాణిజ్య పంటపై దృష్టి
- ఈ ఖరీఫ్‌కు 3.50 లక్షల ఎకరాలకు అంచనా
- గతేడాది లాభాలతో పంటసాగుకు మొగ్గు

కౌటాల: రాష్ట్ర ప్రభుత్వం ఆహార ధాన్యాల సాగు చేయాలని చెబుతున్నా రైతులు పత్తి సాగు వైపే చూస్తున్నారు. పత్తి వాణిజ్య పంట కావడంతో లాభాలు అధికంగా వస్తాయనే ఆలోచనతో ఆహార ధాన్యాల సాగుకు మొగ్గుచూపడం లేదు. గతేడాది పత్తికి వచ్చిన లాభాల కారణంగా ఈ పంట సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ఈసారి 3.50 లక్షల పత్తి సాగు?

జిల్లాలో వానాకాలం పంటల సాగు ప్రణాళికలను వ్యవసాయశాఖ అధికారులు ఖరారు చేశారు. గతేడాది 3.40 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. ఈ ఏడాది 3.50 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేస్తారని అంచనా వేశారు. పశువులు రోజూ గడ్డి మేయడానికి స్థలం లేకుండా దుక్కులు దున్నుతున్నారు. ఇటీవల కాలంలో రైతులు పత్తి, సోయా, పొద్దు తిరుగుడు పంటలు సాగు చేస్తుండడంతో ఆహార పంటల సంఖ్య తగ్గిపోయింది. గ్రామాల్లో పశుగ్రాసం దొరక్కపోవడంతో మూగజీవాలు ఇబ్బంది పడాల్సి వస్తోంది.

గతంలో..

జిల్లాలో ఒకప్పుడు రైతులు వరి, మొక్కజొన్న తోపాటు పెసర, కంది, శనగ, మినుము చిరుధాన్యాలు సాగు చేశారు. ఏటా ప్రకృతి వైపరీత్యాలు, వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. పప్పు దినుసు పంటలు సక్రమంగా దిగుబడులు రాకపోవడంతో రైతులు నష్టపోయారు. దీంతో పత్తి వైపే మొగ్గు చూపారు. ఆ పంటనే ప్రధానంగా సాగు చేస్తున్నారు. కంది ఒకప్పుడు వేల ఎకరాల్లో సాగైతే ఇప్పుడు వందల ఎకరాలకు పడిపోయింది. ఇతర ఆహార ధాన్యాల పంటల సాగు అంతంత మాత్రంగా ఉంది. వ్యవసాయాధికారులు పంటల సాగుపై అవగాహన కల్పించడంతో పాటు ఉచితంగా విత్తనాలు పంపిణీ చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.



పత్తి పంట (ఫైల్)

పశుగ్రాసం దొరకడం లేదు

పత్తి పంట పండించడంతో పశువులకు పశుగ్రాసం దొరకడం లేదు. పశువులను కబేళాలకు విక్రయిస్తున్నారు. అధికారులు ఆహార పంటలు సాగు చేసేలా అవగాహన కల్పించాలి. పంటలకు మద్దతు ధర పెంచాలి.

– మల్లయ్య, రైతు, గురుడుపేట

అవగాహన కల్పిస్తున్నాం

పంట మార్పిడి చేస్తే రైతులకు దిగుబడితోపాటు గిట్టుబాటు ధర వస్తోంది. ఖరీఫ్ పంట సాగు ప్రణాళిక సిద్ధం చేశాం. ఈసారి చిరుధాన్యాల సాగుపై ప్రత్యేక దృష్టి పెట్టాం. గ్రామాల్లో ఏఈవోలు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. – రాజేశ్, ఏవో, కౌటాల

పని చేసేవారికే ‘ఉపాధి’

- రోజు కూలి రూ.272 పెంచిన ప్రభుత్వం
- అయినా పనిలో కూలీలు నామమాత్రమే..
- హాజరుకాని జాబ్‌కార్డులే అధికం
- పొలం పనుల్లో కూలీలు నిమగ్నం

కెరమెరి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో క్రమక్రమంగా మార్పులు జరుగుతున్నాయి. ఆ పథకంలో సమూల మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తాజాగా శ్రమించే కూలీలకే అధిక ప్రాధాన్యం కల్పిస్తుండడం విశేషం. ఇక నుంచి రోజంతా కష్టపడి పనిచేసే వారినే ఉపాధి పనులకు పిలవనున్నారు. నామమాత్రంగా పని చేసి చేతులు దులుపుకొనే వారి ఆటలు ఇక సాగవు. ప్రభుత్వం కూలీకి రూ.272 పెంచిన విషయం విదితమే. పెంచిన మొత్తాన్ని దక్కించుకునే విధంగా కూలీలు పని చేయాల్సి ఉంటుంది.

యాక్టివ్ కూలీలు 30 శాతమే!

మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఏడుగురు టీఏలు, ఏడుగురు ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు. మండలంలో 8398 జాబ్ కార్డులు ఉండగా.. 6979 యాక్టివ్ జాబ్‌కార్డులు ఉన్నాయి. 13,354 మంది కూలీలకు 4240 మాత్రమే యాక్టివ్‌గా ఉన్నారు. అంటే కేవలం 30 శాతం కూలీల మాత్రమే పనికి వెళ్తున్నారు. వేలాది కూలీల్లో 150 మంది మాత్రమే రూ.272 సంపాదిస్తున్నారు. వీరిలో అధికమంది నర్సరీ, పల్లె ప్రకృతివనాలు, అవెన్యూ ప్లాంటేషన్, తదితర పనుల్లో ఉన్నవారు ఉన్నారు. ప్రభుత్వం చెల్లిస్తున్న రోజువారీ కూలి రూ.272 సంపాదిస్తున్నారు. సరాసరి దినసరి కూలీరేటు రూ.190 పడుతుంది. యాక్టివ్ కూలీల జాబితాను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఆధార్ నంబర్లు, బ్యాంకు ఖాతా వివరాలు సేకరించారు. పనులకు హాజరుకాని వారి జాబ్‌కార్డులు గతంలో రద్దుచేశారు. యాక్టివ్‌గా ఉన్న కూలీలనే ప్రస్తుతం పిలవనున్నారు.



పనులు చేస్తున్న కూలీలు

ప్రతి పంచాయతీ నుంచి 200 మంది కూలీలు

నూతన ఆర్థిక సంవత్సరం ప్రారంభమై రెండు మాసాలు గడిచింది. ప్రతి పంచాయతీ నుంచి 200 మంది కూలీలు హాజరయ్యేలా చూడాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. కాని 100 మంది కూలీల వరకు హాజరవుతున్నారు. యాసంగి సాగు పనుల్లో కూలీలు, రైతులు నిమగ్నం కావడంతో ఉపాధి పనులకు కూలీల శాతం తగ్గింది. కాగా, మరికొద్ది రోజుల తర్వాత వానలు కురిస్తే అనేక మంది పంట పొలాల్లో ఉంటారు. ప్రస్తుతం వచ్చే కూలీల సంఖ్య కూడా తగ్గే అవకాశం ఉంది.

సద్వినియోగం చేయాలి

నూతన విధానంలో చేపడుతున్న ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేయాలి. పనికి వచ్చేవారు రూ.272 సంపాదించవచ్చు. చాలా ప్రాంతాల్లో నేల గట్టిక ఉండడం, మండుతున్న ఎండల దృష్ట్యా కూలీలు శాతం తగ్గుతుంది. టీఏల ద్వారా క్షేత్రస్థాయిలో కొలతలు వేసి ఇస్తున్నాం.

– మల్లయ్య, ఈజీఎస్ ఏపీవో, కెరమెరి

మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయం



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

రెబ్బెన(ఆసిఫాబాద్): వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేపట్టడం అభినందనీయమని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ జిల్లా నాయకురాలు మన్యం పద్మ చేపట్టిన మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్సీ సందర్శించారు. పనుల నిమిత్తం గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు, ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. గత 17 రోజులుగా మజ్జిగ పంపిణీ చేపడుతున్న పద్మ, సత్యనారాయణ దంపతులను అభినందించి సన్మానించారు. ఎంపీపీ సౌందర్య, జెడ్పీటీసీ సంతోష్, సర్పంచ్ అహల్యాదేవి, ఉప సర్పంచ్ మడ్డి శ్రీనివాస్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మహేశ్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు సుదర్శన్‌గౌడ్, రాజేశ్వర్‌రావు, కోఆప్షన్ సభ్యుడు జహురొద్దీన్ పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యలపై నేడు ఆందోళనలు

రెబ్బెన(ఆసిఫాబాద్): గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్నట్లు మోకుదెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసరి ఆంజనేయులుగౌడ్ తెలిపారు. గోలేటిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గీత కార్మికులకు రూ.లక్ష ఆర్థిక సాయం, మోటర్ సైకిల్, ఏజెన్సీ గీత కార్మికులకు లైసెన్స్‌ల పునరుద్ధరణ, బ్రాందీ షాపుల్లో 50 శాతం రిజర్వేషన్లు తదితర సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. చేతి, కులవృత్తుల వారికి రూ.లక్ష ఆర్థికసాయాన్ని ప్రకటించిన ప్రభుత్వం గీత కార్మికులను విస్మరించడం శోచనీయమన్నారు. శుక్రవారం అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు, 10న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాలో కార్మికులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో గౌడ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, రాష్ట్ర నాయకులు కిషన్‌గౌడ్, నవీన్‌గౌడ్, మండల నాయకులు మధూకర్‌గౌడ్, మోహన్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

‘ప్రాణహిత’ నిర్మించకుండా చెరువుల సంబురాలా?

- బీజేపీ నాయకుడు హరీశ్‌బాబు

చింతలమానెపల్లి: సిర్పూర్ నియోజవర్గంలోని తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిపై ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణం నిర్మించకుండా బీఆర్ఎస్ నాయకులు చెరువుల సంబురాలు నిర్వహిస్తున్నారని బీజేపీ నాయకుడు పాల్వాయి హరీశ్‌బాబు మండిపడ్డారు. మండలంలోని లంబాడిహేటి, గుప్పగూడెం గ్రామాల్లో పల్లె పల్లెకూ పాల్వాయి-గడప గడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా గురువారం పర్యటించారు. గ్రామాల్లో బీజేపీ జెండాను ఆవిష్కరించా రు. చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు నిర్మించకుండా ఎకరాకు సాగునీరు ఇవ్వకుండా రైతులను, ప్రజలను బిఆర్ఎస్ నాయకులు మభ్య పెడుతున్నారని ఆరోపించారు. అజ్మీర శంకర్‌నాయక్, ధరావత్ శంకర్, బలరాం, సపావట్ కృష్ణ, ధనరాజ్, జాటోత్ విఠల్, కుకుడ్‌కార్ రమేశ్, ఎల్ములె మల్లయ్య, మైదం శంకర్, సిడాం రావుజీ, రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.



లంబాడిహేటిలో బీజేపీ జెండా ఆవిష్కరిస్తున్న పాల్వాయి హరీశ్‌బాబు

బహిరంగ సభ విజయవంతం చేయాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా గర్జన ముగింపు సందర్భంగా కొత్తగూడెంలో ఈనెల 11న నిర్వహించే బహిరంగ సభ విజయవంతం చేయాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి కోరారు. గురువారం గోలేటిలోని కేఎల్ మహేంద్రభవన్‌లో, గోలేటి సివిల్ డిపార్టుమెంట్ కార్యాలయంలో వేర్వేరుగా బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో ప్రైవేటీకరణను కేంద్రం వెంటనే ఆపి కొత్త గనులు సింగరేణికే కేటాయించాలన్నారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం సింగరేణిలో వెంటనే ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్మికులకు సొంత ఇంటి పథకాన్ని వర్తింపజేయాలని, కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని, రిటైర్డ్ కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించడంతోపాటు ఓసీపీల్లో భూములు కోల్పోయిన భూనిర్వాసితులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. బ్రాంచి ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, శ్రీనివాస్, చంద్రశేకర్, ఫిట్ కార్యదర్శి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్రోచ్ పనులు పరిశీలన

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్, దహెగాం మండలాల మధ్య పెద్దవాగు వంతెన అప్రోచ్ పనులను ఎమ్మెల్యే కోనేరు కోనప్ప గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాలకు రవాణా మెరుగుపర్చడానికి రోడ్లు, వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించి పెద్దపీట వేసిందన్నారు. సర్పంచులు దుర్గం రాజన్న, ఉపాసీ సంజీవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చౌదరి తిరుపతి, కోఆప్షన్ సభ్యుడు సాజీద్, నాయకులు చలం, ఖైరాత్, భక్తు రాంచందర్, శేఖర్, ఇలియాస్, రామన్న తదితరులు ఉన్నారు.

తాగునీటి కోసం ఆందోళన

చింతలమానెపల్లి: మండలంలోని రణవెల్లిలో తాగునీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు గురువారం ఆందోళన చేపట్టారు. గ్రామంలో ఒక వాడలో నీళ్లు సరఫరా అవుతున్నాయని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కుళాయి వద్ద నీటి బిందెలతో నిరసన తెలిపారు. ప్రతి వేసవిలో నీటి ఎద్దడితో ఇబ్బంది పడుతున్నామని పలువురు మహిళలు, గ్రామస్తులు ఈ సమస్యను సర్పంచ్ జాటోత్ సోమేశ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి.. మిషన్ భగీరథ ఏఈ ఉదయ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. భగీరథ నీరు సరఫరా కావడం లేదని వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు. గ్రామంలో పనులకు కాంట్రాక్టర్ రావడం లేదని కొత్త కాంట్రాక్టర్‌తో పనులు నిర్వహించి నీటి ఇబ్బంది లేకుండా చూస్తామని ఏఈ తెలిపారు.



నిరసన తెలుపుతున్న మహిళలు